సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 15 । ఆగస్టు । 2025

100 మీటర్ల జాతీయ జెండాతో తెనుగుపూడి గురుకుల విద్యాలయం విద్యార్థుల ర్యాలీ

II లో





చూడ'చెక్కిన' జెండా

పాయకరావుపేటకు చెందిన కె.సంజయ్ దీపక్ 0.7 మి.మీ పెన్సిల్ ముల్లుపై జాతీయ జెండాను సూక్ష్మకళతో రూపకల్పన చేశాడు. మైక్రోస్కోప్ వినియోగించకుండా సూక్ష్మకళలో ఇలా తన ప్రావీణ్యం ప్రదర్శించాడు.

- పాయకరావుపేట



అనకాపల్లి, నెహ్రూచౌక్ జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడిన ప్రజలు

తిరంగా... ఘనంగా

జెండా పండగకు జిల్లా ముస్తాబైంది. దేశభక్తిని, జాతీయ భావాన్ని పెంపొందించేలా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపునిస్తూ గురువారం వాడవాడలా హర్ ఘర్ తిరంగా ర్యాలీలు జరిపారు. స్వాతంత్య్ర సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసిన మహనీయుల సేవలను స్మరించుకునే సుదినం నేడు. ఈ సందర్భంగా స్వాతంత్య్ర దిన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

II లో



హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే



మువ్వన్నెల విద్యుత్ కాంతులతో ఆకర్షిస్తున్న కలెక్టరేట్

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

తుమ్మపాల : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రానున్న మూడు రోజులు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించినట్టు గురువారం ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలు సహాయం కొరకు కంట్రోల్ రూమ్ నెంబర్. 08924 **222888, 08924** 225999, 08924 22659**9 కు ఫోన్ చేయాలని** తెలిపారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగంలో ముగ్గురికి అవకాశం

విశాఖ సిటీ: వైఎస్సార్ **సీపీ రాష్ట్ర యువజన** విభాగ కమిటీలో విశాఖ **జిల్లా నుంచి ముగ్గురు** చోటు కల్పించారు. ఈ **మేరకు పార్టీ కేంద్ర** కార్యాలయం గురువా**రం ప్రకటించింది.** మాజీ ముఖ్యమంత్రి, **వైఎస్సార్ సీపీ** అధ్యక్షుడు వై.ఎస్.జగన్**మోహన్‌రెడ్డి ఆదేశాల** మేరకు ఈ నియామ**కాలను చేపట్టినట్లు** తెలిపింది. రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శులుగా చందక అప్పలస్వామి(భీమిలి), కంకల ఈశ్వరరావులను, సంయుక్త కార్యదర్శిగా జగ్గుపల్లి నరేష్(భీమిలి)ను నియమించారు.

అనకాపల్లి నుంచి చంద్రమౌళి

అనకాపల్లి జిల్లా పెందుర్తి నియోజకవర్గానికి చెందిన కోరాడ చంద్రమౌళిని రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శిగా నియమించారు.

గవర్నర్ విందుకు బాక్సింగ్ క్రీడాకారిణికి ఆహ్వానం



నర్సీపట్నం : బాక్సింగ్ క్రీడాకారిణి బొంతు మౌనిక కళ్యాణంకు గవర్నర్ కార్యాలయం నుంచి ఆహ్వానం అందింది. నర్సీపట్నంకు చెందిన మౌనికకు కలెక్టర్ ద్వారా రాజ్‌భవన్ నుంచి గవర్నర్ కార్యదర్శి లేఖ పంపించారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 15వ తేదీ సాయంత్రం గవర్నర్ బంగ్లాలో ప్రముఖులకు ఇచ్చే విందులో పాల్గొనాలని ఆ లేఖలో పేర్కొన్నారు. శాప్ బాక్సింగ్ సెంటర్‌లో ఐదేళ్ల నుంచి శిక్షణ పొందుతూ 10కి పైగా జాతీయ స్థాయి పోటీల్లో ఒక స్వర్ణ పతకం, 2 రజత, ఒక కాంస్య పతకం సాధించింది. 14 స్టేట్ లెవెల్ పోటీల్లో 8 స్వర్ణ, 2 రజత పతకాలు సాధించింది. గవర్నర్ బంగ్లా నుంచి ఆహ్వానం రావడంతో మౌనిక కళ్యాణంను పలువురు అభినందించారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం : రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు పెదగుమ్ములూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇరువురు ఎంపికైనట్టు వ్యాయామ ఉపాధ్యాయులు నిర్మల తెలిపారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో స్పోర్ట్స్' అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారు నిర్వహించిన బాలికల విభాగం పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. పాఠశాలలో 10 వ తరగతి చదువుచున్న కనిగిరి హరిని,పోలిశెట్టి పావనిలు ఎంపికయ్యారన్నారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయులు సుధామాధురి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తోటి స్నేహితులు ఈ విద్యార్థులను అభినందించారు. ఈ నెల 25వ తేదీన అమరావతి జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొని ఆడతారన్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి విద్యార్థులు ఎంపికకావడం పట్ల శిక్షణ ఇచ్చి వ్యాయామ ఉపాధ్యాయురాలిని, ప్రతిభ క్రీడాకారులను అభినందించారు.

గంగపుత్రుల కష్టాలు తీర్చేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన ఫిష్ లాండింగ్ సెంటరు నిర్మాణాన్ని (జెట్టీ) కూటమి ప్రభుత్వం మరుగున పడేసింది. గత ప్రభుత్వం మంజూరు చేసిన ఫిష్ ల్యాండింగ్ సెంటరు నిర్మించడం మానేసి మిట్టల్ స్టీల్‌ప్లాంట్ ప్రయోజనాల కోసం కార్గోపోర్టు నిర్మాణానికి అవసరమైన అనుమతులు మంజూరు చేసి, ఆగమేఘాల మీద భూములు కేటాయించింది. దీనిపై మత్స్యకార వర్గాలనుంచి తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.



జెట్టీ నిర్మించ తలపెట్టిన బోయపాడు తీరం

మత్స్యకారులు వద్దు, మిట్టల్ ముద్దు!



జెట్టీ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలిస్తున్న అప్పటి కలెక్టర్ రవిపటాన్‌శెట్టి (ఫైల్)

- కూటమి ప్రభుత్వం తీరుపై గంగపుత్రుల ఆగ్రహం
- గత ప్రభుత్వంలో జెట్టీ కోసం రూ.24 కోట్ల కేటాయింపు
- ఫిష్ ల్యాండింగ్ సెంటరు నిర్మాణానికి జీవో
- కూటమి ప్రభుత్వం వచ్చాక పట్టించుకోని వైనం

నక్కపల్లి :

పాయకరావుపేట నియోజకవర్గంలో 17 మత్స్యకార గ్రామాలున్నాయి. సుమారు 25 వేల మంది మత్స్యకారులు జీవిస్తున్నారు. వీరిలో దాదాపు 10 వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా చేపల వేటను ఆధారంగా చేసుకుని జీవిస్తున్నారు. ప్రాణాలకు తెగించి వీరు వేటాడి తెచ్చిన మత్స్య సంపద నిల్వ చేసుకోవడం, భద్రపరచుకోవడం, మార్కెటింగ్ చేసుకోడానికి సరైన సదుపాయాలు లేవు. లక్షలాది రూపాయల విలువైన మత్స్యసంపదను వేటాడి తెచ్చుకుంటున్నప్పటికీ మార్కెటింగ్ చేసుకోలేక మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారు. **ప్రజా సంకల్పపాదయాత్రలో మత్స్యకారుల సమస్యలు స్వయంగా తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీ నిలబెట్టుకుని 2023లో నక్కపల్లి మండలం రాజయ్యపేట, బోయపాడు సమీ**పంలో మినీ జెట్టీ(ఫిష్ ల్యాండింగ్‌సెంటరు) ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేశారు. ఈ జెట్టీ నిర్మాణానికి మొత్తం రూ.24.77 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. కేంద్రం తన వాటా కింద రూ.14.86 కోట్లు కేటాయించగా రాష్ట్రప్రభుత్వ వాటాకింద రూ.9.90కోట్లు మంజూరు చేసింది. ఈ జెట్టీ నిర్మాణానికి అవసరమైన పదెకరాల స్థలాన్ని రాజయ్యపేట, బోయపాడు, దొండవాక ప్రాంతాల్లో ఎంపిక చేశారు. రిజర్వ్ ఫారెస్టుకు చెందిన స్థలం కావడంతో వారికి ప్రత్యామ్నాయంగా పదెకరాలను కేటాయించి ఎంపిక చేసిన భూమిలో జెట్టీ నిర్మించాలనేది గత ప్రభుత్వ నిర్ణయం. జెట్టీ నిర్మాణానికి గుర్తించిన భూములను ఢిల్లీ నుంచి వచ్చిన నిపుణులు, రాష్ట్ర, జిల్లా మత్స్యశాఖ ఉన్నతాధికారులు సైతం పరిశీలించి అనువైన ప్రాంతంగా నివేదిక ఇవ్వడంతో ప్రభుత్వం నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసింది.

గత ప్రభుత్వంలో ఇవీ ప్రతిపాదనలు...

- రూ.2.32 కోట్లు వెచ్చించి జెట్టీ ఇతర భవనాల నిర్మాణం.
- రూ.33లక్షల వ్యయంతో పచ్చదనం,మొక్కల పెంపకం
- **రూ.34లక్షలతో వాహనాల పార్కింగ్ సదుపాయం**
- **రూ.1.88కోట్లతో చేపలను ఎండబెట్టుకునేందుకు 2 ప్లాట్‌ఫారాల నిర్మాణం**
- రూ.15లక్షల వ్యయంతో ట్రక్ పార్కింగ్ నిర్మాణం
- రూ.21లక్షల వ్యయంతో మత్స్య సంపద కోసం లోడింగ్ సెంటరు (షెడ్లు) నిర్మాణం
- రూ.1.11 కోట్ల వ్యయంతో చేపల కొనుగోళ్లు, అమ్మకాల కోసం పెద్ద హాళ్ల నిర్మాణం
- రూ.5.94 లక్షలతో ఫిష్‌ల్యాండింగ్ ఫ్లాట్ ఫారాలు
- రూ.32.24లక్షలతో బీచ్ ల్యాండింగ్ ఫ్లాట్‌ఫారం
- రూ.7.11కోట్ల వ్యయంతో జెట్టీ వద్ద మెకనైజ్డ్, మోటారుబోట్లు, ఇంజిజన్లు తెప్పలు పార్కింగ్ మరమ్మతుల కోసం ప్రత్యేకంగా భవనాలు, షెడ్ల నిర్మాణం
- రూ.1.98 కోట్లతో జెట్టీ నిర్మించే ప్రాంతాల్లో సిమెంటు రోడ్ల నిర్మాణం
- రూ.64 లక్షల వ్యయంతో మురుగునీటి కాలువల నిర్మాణం
- రూ.1.14కోట్ల వ్యయంతో ప్రహరీ గోడ నిర్మాణం
- రూ.9.88లక్షల వ్యయంతో వ్యర్థజలాలను శుద్ధి చేసే ప్లాంటు ఏర్పాటు
- రూ.46.92లక్షల వ్యయంతో వలలు, మరమ్మతులు, భద్రపరచుకునే షెడ్ల నిర్మాణం
- **రూ.39**.42లక్షల వ్యయంతో విశ్రాంతి భవనాల నిర్మాణం
- **రూ.10**లక్షల వ్యయంతో మరుగుదొడ్ల ఏర్పాటు
- **రూ.27**.22లక్షల వ్యయంతో తాగునీరు, వాడుక నీరు కోసం ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం వంటి ప్రతిపాదనలు చేశారు.
- జెట్టీ నిర్మించే ప్రాంతం చుట్టూ బయోఫెన్సింగ్, పటిష్టమైన రక్షణ గేటు కోసం రూ.9.16 లక్షలు కేటాయించారు.
- రూ.16 లక్షలతో నీటివనరులైన బోర్లు, గొట్టపు బావులు, మోటార్లు భూస్టర్ క్లీనింగ్ సదుపాయాలు
- రూ.80.85 లక్షల వ్యయంతో విద్యుత్ సదుపాయం, ట్రాన్స్‌ఫార్మర్లు, వీధిదీపాల సదుపాయాలు
- విద్యుత్ సరఫరా, కనెక్షన్‌ల కోసం మరో రూ.80 లక్షలు కేటాయించారు.
- ముందస్తు అధ్యయనాల కోసం రూ.20 లక్షలు, అత్యవసర పరిస్థితుల్లో ఖర్చు చేసేందుకు రూ.60 లక్షలు కేటాయించారు.

అన్నీ సవ్యంగా జరిగి జెట్టీ నిర్మాణం పూర్తయితే తమ బెంగ తీరినట్లేనని గంగపుత్రులు భావించారు, భూసేకరణలో ఎదురైన సాంకేతిక ఇబ్బందుల వల్ల జెట్టీ నిర్మాణం ఆలస్యమైంది. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఎన్నికల కోడ్ కారణంగా జెట్టీ నిర్మాణం నిలిచిపోయింది. ఎన్నికల ప్రచారంలో టీడీపీ నాయకులు సైతం తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మత్స్యకారుల కోసం ఫిష్ ల్యాండింగ్ సెంటరు నిర్మిస్తామని హామీలు గుప్పించారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం జరిగింది. ఇంతలోనే మిట్టల్ స్టీల్‌ప్లాంట్ తెరమీదకు రావడంతో జెట్టీ అంశం మరుగున పడింది. మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు రాష్ట్రప్రభుత్వం ఈ ఏడాది 2400 ఎకరాలు కేటాయించేసింది. ఈ భూముల్లో మిట్టల్ కంపెనీ సొంత అవసరాల కోసం కార్గో పోర్టు (కాప్టివ్‌పోర్టు) నిర్మించనుంది. 148 ఎకరాల్లో నిర్మించే ఈ క్యాప్టివ్ పోర్టుకు కూటమి ప్రభుత్వం ఆగమేఘాల మీద అనుమతులు మంజూరు చేసింది. దీంతో జపాన్‌కు చెందిన మిట్టల్‌ప్రతినిధుల బృందం పోర్టు నిర్మించే ప్రాంతాలను అధ్యయనం చేసేందుకు రావడం జరిగింది. వేటాడిన మత్స్య సంపద ఎండబెట్టుకునేందుకు ప్లాట్‌ఫారాలు భద్రపరచుకునేందుకు స్టోర్ రూములులేక, ఇంజిన్లు, వలలు భద్రపరచుకునేందుకు స్టోర్‌రూములు, మార్కెటింగ్ చేసుకునేందుకు షెడ్లు లేక మత్స్యకారులు ఇబ్బంది పడుతూంటే జెట్టీ నిర్మించాల్సిన ప్రభుత్వం మిట్టల్ కంపెనీ కార్గోపోర్టుకు అనుమతులు మంజూరు చేయడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూటమిజ ప్రభుత్వ తీరుతో ఇక జెట్టీ విషయం మరుగున పడినట్లేనని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం గంగపుత్రులను మోసం చేసిందని ఆగ్రహంతో రగిలిపోతున్నారు.

జెట్టీ లేక శానా ఇబ్బందులు



జగనన్న ప్రభుత్వం మత్స్యకారుల కోసం జెట్టీ మంజూరు సేసింది. డబ్బులు కూడా ఇడదల సేసింది. పదెకరాల భూమి కూడా సూద్దం జరిగింది. టెండర్లు పూర్తయి జెట్టీ కడతారనుకునే సమయంలో ఎన్నికలు వచ్చేయి, జెట్టీ పని ఆగిపోయింది. ఈ పెబుత్వమైన కడతాది అని ఆశపడ్డాం. కానీ స్టీల్‌ప్లాంట్ ఓళ్ల పోర్టు కట్టుకునేందుకు పెబుత్వం అనుమతి ఇచ్చిందంట. ఇంక మాకు జెట్టి కడతారనే ఆశలు పోయాయి. మమ్మల్ని పెబుత్వం మోసం సేసింది. సముద్రపు ఒడ్డున సదుపాయాలు లేక సానా ఇబ్బంది పడతన్నం. జెట్టీ కడితే మేము పడే కట్టానికి పెతిపలం దక్కేది.

-మైలపల్లి సూరిబాబు, మత్స్యకారుడు రాజయ్యపేట

కొలిక్కి రాని చర్చలు

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలోని వాడనర్సాపురం వాసులకు నేవల్ బేస్ అధికారులకు గురువారం జరిగిన చర్చలు కొలిక్కి రాలేదు. పైడమ్మ చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేయాలని ప్రయత్నిస్తున్న డీజీఎన్‌పీ సిబ్బందిని అడ్డుకుంటున్న స్థానికుల మధ్య నెలకొన్న వివాదం ఇంకా కొనసాగుతూనే ఉంది. రెండు వర్గాల మధ్య జరుగుతున్న వాగ్వాదం సామరస్యంగా పరిష్కరించుకోవాలని పోలీసులు సూచించడంతో డీజీఎన్‌పీ సిబ్బంది వెనుదిరిగారు. తర్వాత వాడనర్సాపురం వాసులు తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్లగా ఆయన అర్జెంట్ పని నిమిత్తం మాట్లాడి వెళ్లిపోయారు. తర్వాత మత్స్యకారులతో స్థానిక పోలీసు అధికారులు చర్చలు జరిపి శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. అయితే తమ గ్రామాన్ని తరలించాల్సి వస్తే అప్పుడు మాత్రమే చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేసుకోవాలి తప్ప ప్రస్తుతం ఎటువంటి పనులు చేపట్టినా అడ్డుకుంటామని, ఈ విషయంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పిస్తామని పేర్కొన్నారు.



వాడనర్సాపురం వాసులతో చర్చిస్తున్న పోలీసు అధికారులు

అయితే గ్రామస్తులు కోరిన చోట ఫెన్సింగ్ వేయకుండా వదిలి మిగిలిన ప్రాంతాల్లో ఫెన్సింగ్ వేస్తామని నేవల్ అధికారులు చెప్పడం గమనార్హం.

యాచకులు లేని నగరంగా విశాఖ

- జ్యోతిర్గమయ కార్యక్రమానికి శ్రీకారం
- 243 మంది యాచకులను రెస్క్యూ చేసిన పోలీసులు

అల్లిపురం (విశాఖ): యాచకులు లేని నగరంగా విశాఖను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పది నెలల కిందట నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తలపెట్టిన 'జ్యోతిర్గమయ' కార్యక్రమానికి ఒక రూపు వచ్చింది. ఈ కార్యక్రమం ద్వారా నగరంలోని యాచకులకు తగిన ఆశ్రయం కల్పించి, వారిని గౌరవప్రదమైన జీవితం వైపు నడిపించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీపీ తెలిపారు. గురువారం పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ మాట్లాడారు. 'తమసోమా జ్యోతిర్గమయ' అంటే చీకటి నుంచి వెలుగు వైపు ప్రయాణమని వివరించారు. రోడ్లపై భిక్షాటన చేసే నిరాశ్రయులను రోజూ చూసి బాధపడేవాడినని, ప్రతి మనిషి గౌరవంగా జీవించడానికి ప్రయత్నించాలన్నారు. కంట్రోల్ రూమ్ ఇన్‌స్పెక్టర్ హుస్సేన్, హార్బర్ సీఐ సింహాద్రి నాయుడు, స్పెషల్ బ్రాంచ్ సీఐ తిరుపతిరావు, సీఐ చప్పా ప్రసాద్(వీఆర్), నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ప్రారంభించినట్లు చెప్పారు. గురువారం ఒక్క రోజే 243 మంది యాచకులను గుర్తించి, వారికి క్షవరం, స్నానం చేయించి, కొత్త దుస్తులు ఇచ్చి, టిఫిన్‌తో పాటు భోజనం కూడా అందించినట్లు తెలిపారు. 243 మందిలో 45 మంది బాగా ఉండటంతో వారి కుటుంబ సభ్యులను పిలిపించి, వారికి అప్పగించినట్లు వివరించారు. మానసిక స్థితి సరిగా లేని 9 మందిని ప్రభుత్వ మానసిక ఆరోగ్య ఆసుపత్రిలో చేర్పించామన్నారు. మిగిలిన 189 మందిని వివిధ పునరావాస కేంద్రాలకు పంపించినట్లు తెలిపారు.



యాచకులతో కలిసి భోజనం చేస్తున్న సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

శ్మశానవాటికలో పచ్చనేత పాగా!

- స్థలం ఆక్రమించి బడ్డీల ఏర్పాటు
- తహసీల్దార్ కార్యాలయం వద్ద గ్రామస్తుల ఆందోళన

చోడవరం :

అధికారపార్టీ నాయకుల భూ ఆక్రమణలకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. బంజరు భూములు, కొండగెడ్డలే కాకుండా ఏకంగా శ్మశాన స్థలాన్నే ఆక్రమించడానికి పూనుకున్నాడు తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకుడు. ఇతడి ఆక్రమణ నుంచి తమ శ్మశానాన్ని రక్షించాలని కోరుతూ చోడవరం తహసీల్దార్‌కు, ఎమ్మెల్యేకు స్థానికులు గురువారం ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే...చోడవరం మండలం గవరవరం గ్రామంలో మూడు శ్మశాన వాటికలు ఉన్నాయి. వీటిలో ఒకటి కొన్ని వీధుల వారు వినియోగించుకోవడానికి కేటాయించారు. దీనిని గతంలో కొందరు ఆక్రమించుకోగా గ్రామస్తులు కోర్టుకు వెళ్లడంతో కోర్టు గ్రామస్తులకు అనుకూలంగా ఇటీవల తీర్పు ఇచ్చింది. అప్పటి నుంచి యధావిధిగా ఈ శ్మశానవాటికను గ్రామస్తులు వినియోగిస్తున్నారు. తాజాగా ఈ శ్మశాన వాటికలో కొంత భాగాన్ని ఇదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు చప్పగడ్డ వెంకటస్వామినాయుడు ఆక్రమించుకొని బడ్డీలు ఏర్పాటు చేశాడు. దీంతో గ్రామస్తులు తిరుగుబాటు చేసి ఆయనను ప్రశ్నించారు. ఈ స్థలాన్ని తాను గుండుపు నారాయణమ్మ అనే వాళ్ల దగ్గర కొనుగోలు చేశానంటూ సమాధానం ఇవ్వడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార బలంతో గ్రామస్తులను ఎదిరించి టీడీపీ నాయకుల బడ్డీలు కూడా పెట్టాడు. దీనిపై గ్రామస్తులు చోడవరం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి నిరసన తెలిపారు. తహసీల్దార్ రామారావుకు వినతిపత్రం ఇచ్చి తమ శ్మశాన వాటికను కాపాడాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజుకు వినతిపత్రం ఇచ్చారు. దీనిపై చర్యలు తీసుకుంటామని, సర్వే చేసి రికార్డులు పరిశీలించి సర్వే చేసి న్యాయబద్ధంగా స్థలాన్ని అప్పగిస్తామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో వారంతా వెనుదిగారు. ఇదిలావుండగా గ్రామస్తుల తరఫున గతంలో కోర్టుకు వెళ్లి ఈ స్థలం గ్రామానికి చెందిన శ్మశాన వాటికదే అని పోరాటం చేసిన వారిలో ఇదే మాజీ సర్పంచ్ కూడా ఉన్నారని, తీరా అధికారం వచ్చాక ఆయనే ఆ శ్మశాన స్థలాన్ని ఆక్రమణ చేస్తున్నాడని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆక్రమణలు తొలగించకపోతే ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని గ్రామస్తులు హెచ్చరించారు.



శ్మశాన వాటిక స్థలంలో బడ్డీలు ఏర్పాటు చేసిన దృశ్యం



తహసీల్దార్ రామారావుకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

నేడు, రేపు మాంసం దుకాణాలకు సెలవు

డాబాగార్డెన్స్:

నగర పరిధిలోని మాంసం, చికెన్, చేపల దుకాణాలకు ఈ నెల 15, 16 తేదీల్లో సెలవు ప్రకటించినట్లు జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 15న స్వాతంత్య్ర దినోత్సవం, 16న శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత దుకాణాలు, జంతు వధశాలలు మూసివేయాలని, నిబంధనలు అతిక్రమించి మాంసం విక్రయాలు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో వేచలం విద్యార్థిని ఘనత

దేవరాపల్లి: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వేచలం హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని బొడబళ్ల చైతన్య సత్తా చాటి గోల్డ్ మెడల్ సాధించింది. ఈ మేరకు బాపట్ల జిల్లా చీరాలలో ఇటీవల జరిగిన 36వ స్టేట్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో చైతన్య విశేష ప్రతిభ కనబరిచింది. అండర్-16 విభాగంలో పెంటాథ్లీన్(60 మీటర్లు రన్నింగ్, 80 మీటర్లు హార్డిల్, లాంగ్ జంప్, షార్ట్ పుట్, 600 మీటర్లు రన్నింగ్) సత్తా చాటి గోల్డ్ మెడల్‌ను కైవసం చేసుకుంది. సెప్టెంబర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. రాష్ట్ర స్థాయి పోటీలలో సత్తా చాటి గోల్డ్ మెడల్‌ను కైవసం చేసుకున్న విద్యార్థిని చైతన్యను ఎంఈవో-1 సిహెచ్. ఉమ ఎంఈవో-2 వి.ఉషారాణి, ఇంచార్జ్ హెచ్‌ఎం పి. వెంకటరావు, స్థానిక ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు ప్రత్యేకంగా అభినందించారు. త్వరలో జరిగే జాతీయ స్థాయిలో పోటీలలో సైతం సత్తా చాటి మరిన్ని మెడల్స్ సాధించాలని ఆకాంక్షించారు.



రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో సత్తా చాటి గోల్డ్ మెడల్ అందుకున్న వేచలం హైస్కూల్ విద్యార్థిని చైతన్య

క్లుప్తంగా

ప్రతి ఇంటిపైనా మువ్వన్నెల జెండా ఎగరాలి

- ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ
- పాల్గొన్న జాయింట్ కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే

అనకాపల్లి టౌన్ : ప్రజలలో దేశభక్తిని, జాతీయ భావాన్ని పెంపొందించేలా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి పిలుపునిచ్చారు. ఈ నెల 8 నుంచి జరుగుతున్న హర్ ఘర్ తిరంగా ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం నుంచి నాలుగురోడ్ల కూడలి వరకు హర్ ఘర్ తిరంగా యాత్ర ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశం కోసం అహర్నిశలూ శ్రమించి స్వాతంత్ర సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసిన మహనీయుల సేవలను స్మరించుకుంటూ వారి బాటలో పయనిద్దామని తెలిపారు. ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ యువతలో దేశభక్తిని పెంపొందించేందుకు ఈ తిరంగా ర్యాలీని నిర్వహిస్తున్నామన్నారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో ప్రతి ఒక్కరూ విధిగా పాల్గొన్నాలన్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఇంటి మీద జాతీయ పతాకం ఎగురవేయడం ద్వారా స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వై సత్యన్నారాయణ, ఆర్డీవో షేక్ అయిషా, జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి, వివిధ శాఖల అధికారులు, సామాజిక సంస్థల ప్రతినిధులు ప్రజలు పాల్గొన్నారు.

ఓటు చోరీపై ప్రజలకు సమాధానం చెప్పండి

- ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేసిన విదసం


నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘాలు

బీచ్‌రోడ్డు: 'మా ఓటు భద్రం.. చోరీ కానివ్వకండి'.. 'ఓటు చోరీపై ప్రజలకు సమాధానం చెప్పండి', 'బీహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ఆపండి'అని విదసం నాయకులు డిమాండ్ చేశారు. విస్తృత దళిత సంఘాల (విదసం) ఐక్య వేదిక రాష్ట్ర సమితి కన్వీనర్ డా.బూసి వెంకట రావు ఆధ్వర్యంలో గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన భారత ఎన్నికల కమిషనర్‌ను ఉద్దేశించి మాట్లాడారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం ప్రతి పౌరుడికి ఒకే ఓటు, ఒకే విలువ ఉండగా.. దేశంలో ఇటీవల జరుగుతున్న ఓట్ల చోరీపై ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. బీహార్‌లో ఎస్ఐఆర్, కర్ణాటకలోని మహాదేవపురలో జరిగిన ఓట్ల మాయాజాలంపై ప్రజల అనుమానాలను నివృత్తి చేయాల్సిన ఎన్నికల సంఘం.. ప్రశ్నించిన వారినే నిందిస్తోందని ఆయన విమర్శించారు. బీహార్‌లో ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను పెద్ద సంఖ్యలో తొలగించడానికే ప్రత్యేక సమగ్ర సవరణ చేపడుతున్నారని, ఇది ఎన్నికల సంఘానికి రాజ్యాంగం కల్పించిన స్వయం నిర్ణయాధికారాన్ని దుర్వినియోగం చేయడమేనని ఆరోపించారు. మహాదేవపుర ఎంపీ నియోజకవర్గం ఓటర్ల జాబితాలో బయటపడ్డ వేలాది నకిలీ ఓటర్లపై సమగ్ర విచారణ జరిపి, ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విదసం నేతలు సోడా దాసి సుధాకర్, గుడివాడ ప్రసాద్, బూల భాస్కరరావు, డి.నిర్మల, ఫ్రాన్సిస్, ఉత్తరాంధ్ర రాజ్యాంగ హక్కుల నేత బాగం గోపాల్, బనాస అధ్యక్షుడు టి.శ్రీరామ్ మూర్తి, పట్టా రామప్పారావు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య చరిత్రకు ఆనవాళ్లు.. ఈ స్థూపాలు


చోడవరంలో ఒక నాడు బ్రిటిష్ జెండా ఎగిరి, నేడు భారతీయ జెండా ఎగురుతున్న వందేళ్ల నాటి హార్డింజ్ గెస్ట్‌హౌస్, ఆ ఆవరణంలో నాటి జెండా దిమ్మ


చోడవరం తహసీల్దార్ కార్యాలయంలో 1947 ఆగస్టు 15న నిర్మించిన జెండా దిమ్మ

చోడవరం: బ్రిటిష్ పాలనలో చోడవరానికి ఒక ప్రత్యేక స్థానమే ఉంది. ఒక పక్క మన్యం వీరుడు అల్లూరు సీతారామరాజు స్వాతంత్ర్యం ఉద్యమం చేసే రోజుల్లో ఈ ప్రాంతం నుంచి అనేక మంది భాగస్వామ్యమై వందేమాతరం అంటూ అడుగులో అడుగు వేయగా.. మరో పక్క హార్డింజ్ అనే బ్రిటిష్ గవర్నర్ చోడవరం కేంద్రంగా చేసుకుని ఈ ప్రాంతంలో పన్నులు వసూలు చేశారు. ఆ బ్రిటిష్ అధికారి విశ్రాంతి తీసుకోవడానికి ఇక్కడ ఓ గెస్ట్ హౌస్ కూడా అప్పట్లో నిర్మించారు. అదే చోడవరం హార్డింజ్ గెస్ట్ హౌస్. నాటి చరిత్రకు నేటికీ సాక్ష్యాలుగా ఉన్న కట్టడాలు ఇక్కడ ఉన్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన 1947 ఆగస్టు 15న దేశంలో నిర్మించిన అతి కొద్ది జెండా స్థూపాల్లో ఒకటి చోడవరంలో ఉంది. ఎందరో మహనీయుల పోరాట ఫలితంగా వచ్చిన స్వాతంత్ర్యానికి ఈ జెండా స్థూపాలే నిలువెత్తు నిదర్శనం.

స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు కావస్తున్నా నాటి జెండా స్థూపాలు అమరవీరుల త్యాగఫలాన్ని నేటి తరానికి గుర్తు చేస్తూనే ఉన్నాయి. బ్రిటిష్ కాలం నుంచి నేటి భారతం వరకు ఎన్నో ప్రత్యేకతలు సంతరించుకున్న చోడవరంలో ఉన్న రెండు జెండా స్థూపాలకు ఎంతో చరిత్ర ఉంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని ప్రకటించిన క్షణమే దేశ వ్యాప్తంగా మువన్నెల జెండా ఎగురవేసేందుకు పలు చోట్ల రాత్రికి రాత్రే సంబరాల నడుమ జెండా స్థూపాలను నిర్మించారు. అప్పుడు నిర్మించిన జెండా స్థూపాల్లో చోడవరం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన స్థూపం ఒకటి. ఈ జెండా స్థూపానికి నేటికి 77 ఏళ్లు. బ్రిటిషు ప్రభుత్వంలో అప్పటి ఎక్సైజ్ ఇన్స్పెక్టర్‌గా పనిచేసిన డి.రామదాసు ఈ జెండా స్థూపాన్ని నిర్మించి మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. తుప్పుపట్టని మిశ్రమ లోహంతో తయారు చేసిన ఇనుప గొట్టంతో ఈ జెండా దిమ్మను నిర్మించారు. అందుకే ఈ స్థూపం ఎన్ని దశాబ్దాలైనా చెక్కుచెదరలేదు.

హార్డింజ్ గెస్ట్ హౌస్ వద్ద బ్రిటిష్ జెండా ఎగిరేందుకు గెస్ట్ హౌస్ బంగ్లాకు ఎదురుగా ఒక స్థూపాన్ని నిర్మించి దాని చుట్టూ ఒక వృత్తాకారంలో దిమ్మను కట్టారు. ఆ స్థూపం ఇప్పటికీ చెక్కు చెదరలేదు. తెల్లదొరలు దేశాన్ని వదిలివెళ్లిపోయారని తెలిసిన వెంటనే ఈ స్థూపంపై బ్రిటిష్ జెండాను దించి భారతీయ మువ్వన్నెల జెండాను అప్పటి స్థానికులు ఎగురవేశారు. సుమారు వందేళ్ల కిందట నిర్మించిన ఈ స్థూపం చరిత్రకు సాక్ష్యంగా నిలిచింది. ఈ రెండు స్థూపాలు స్వాత్రంత్య ఉద్యమానికి ఆనవాళ్లుగా ఈ ప్రాంతంలో ఉన్నాయి. హార్డింజ్ గెస్ట్‌హౌస్‌లో ఇటీవల మహాత్మా గాంధీ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ రెండు చోట్ల ఈ నెల 15న స్వాతంత్ర్య వేడుకలు జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈ డోలీమోతలు ఇంకెన్నాళ్లు!


డోలీ యాత్రతో నిరసన తెలుపుతున్న డొంకాడ గిరిజనులు

- రోడ్డు వేయాలంటూ డొంకాడ గిరిజనుల నిరసన

నర్సీపట్నం : గ్రామానికి రహదారి నిర్మించాలంటూ గొలుగొండ మండలం, డొంకాడ గిరిజనులు అబిద్‌సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు డోలీ యాత్ర నిర్వహించారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.గోవిందరావు మాట్లాడుతూ డొంకాడ గ్రామంలో కొందు గిరిజన కుటుంబాలు జీవనం సాగిస్తున్నారన్నారు. జీవో నెంబరు 726 ఇంపాక్ట్ నిధుల నుంచి పంచాయతీకి 2023లో నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఫారెస్ట్ క్లియరెన్స్ పూర్తయినప్పటికీ నేటికి అధికారులు రోడ్డు పనులు మొదలు పెట్టలేదన్నారు. రహదారి సౌకర్యం లేక డోలీ మోతతో వైద్యం కోసం గర్భిణులు పాంగి మువ్వల, కొండతామల జ్యోతి, సీత మార్గం మధ్యలో మరణించడం జరిగిందన్నారు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, స్కూల్ లేక కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోందన్నారు. చందాలు వేసుకుని నడవడానికి వీలుగా గ్రామస్తులే రోడ్డు వేసుకుంటున్నారన్నారు. డొంకాడతో పాటు పిత్రిగడ్డ, నీళ్ల బంద, పెద్ద గరువు గ్రామాలకు రోడ్లు లేక గిరిజనులు అవస్థలు పడుతున్నారన్నారు. తక్షణమే అధికారులు డొంకాడ గ్రామానికి రోడ్డు వేయాలని లేని పక్షంలో పంచాయతీ కార్యాలయం ముందు నిరసనకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీవో ఎవో, పీఆర్ కార్యాలయంలో వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో తాంబలి సత్తిబాబు, గేమిల సుబ్బారావు, తాంబూలా అప్పారావు, సీఐటీయు జిల్లా కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

400 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ


చౌడువాడలో 400 అడుగుల జాతీయ జెండాతో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం


హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాలతో ర్యాలీలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు

కె.కోటపాడు : చౌడువాడ పంచాయతీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. 400 అడుగుల జాతీయ జెండాతో హైస్కూల్ విద్యార్థులు ఉత్సాహంగా ర్యాలీ చేపట్టారు. గ్రామంలోని ప్రధాన రోడ్డు మార్గంలో భారీ జాతీయ జెండాతో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీ అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, పంచాయతీ కార్యదర్శి బి.సురేష్‌బాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ ఏటుకూరి రాజేష్ పాల్గొన్నారు.

దేవరాపల్లి: తెనుగుపూడి డా. బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల విద్యాలయం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా 100 మీటర్ల జాతీయ జెండాతో గురువారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక గురుకుల విద్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీని ప్రిన్సిపాల్ ఎస్.విక్టర్ పాల్ జాతీయ జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది భారతమాతాకి జై, మేరా భారత్ మహాన్ అంటూ నినాదాలు చేశారు. విద్యార్థుల్లో దేశ భక్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఈ ర్యాలీని నిర్వహించామని ప్రిన్సిపాల్ తెలిపారు.

కలెక్టరేట్‌లో పంద్రాగస్టు వేడుకలకు ఏర్పాట్లు

తుమ్మపాల : 79వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకుని కలెక్టర్ కార్యాలయం విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబు చేశారు. మువ్వన్నెల రంగుల కాంతుల వెలుగులో కార్యాలయ భవనం గురువారం రాత్రి మరింత అందంగా కనిపించింది. శుక్రవారం పంద్రాగస్టు వేడుకలకు జిల్లా యంత్రాంగా ఏర్పాట్లు చేసింది. హోంమంత్రి అనిత కలెక్టరేట్‌లో జెండావిష్కరణ చేయనున్నారు.

కళా రంగానికి పుట్టినిల్లు మునగపాక


నాటిక ప్రదర్శనలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్
- ఆహ్వాన నాటిక ప్రదర్శనల ప్రారంభం

మునగపాక : నేటి యుగంలో కళారంగానికి పుట్టినిల్లుగా మునగపాక రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ పేర్కొన్నారు. ఏటా నాటిక పరిషత్‌లు నిర్వహిస్తూ ఎంతో మంది కళాకారులను ప్రోత్సహిస్తున్న గ్రామీణ యువజన మందిరం సేవలు మరువరానివన్నారు. మునగపాక నందీశ్వర కళా ప్రాంగణం తులసీ కళావేదికపై గ్రామీణ యువజన మందిరం 61వ వార్షికోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఉమ్మడి విశాఖ జిల్లా ఆహ్వాన నాటిక ప్రదర్శనలను ఆయన గురువారం రాత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఎంతో మంది కళాకారులను తీర్చిదిద్దిన ఘనత గ్రామీణ యువజన మందిరానికే దక్కుతుందన్నారు గ్రామీణ యువజన మందిరం అధ్యక్షుడు ఆడారి శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మళ్ల సంజీవరావు, పెద్దలు కాండ్రేగుల జగ్గారావు, పెంటకోట సత్యనారాయణ, కోనపల్లి రామ్మోహనరావు, ఆలంక ప్రకాశరావు, యువజన మందిరం కార్యవర్గ సభ్యులు మళ్ల జోగారావు, మళ్ల రామజోగినాయుడు, ఆడారి లక్ష్మణరావు, ఆడారి సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రంగస్థల కళాకారులు కాండ్రేగుల జగ్గారావును సత్కరించారు.


మాతృదేవోభవ నాటికలో ఓ సన్నివేశం

ఆకట్టుకున్న నాటిక ప్రదర్శనలు

ఉమ్మడి విశాఖ జిల్లా ఆహ్వాన నాటిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. పెందుర్తికి చెందిన శ్రీగౌరీ నటరాజా డ్రమాటిక్ అసోసియేషన్ వారి చీమా..చీమా..ఎందుకు కుట్టావ్, మాతృదేవోభవ నాటికలు అలరించాయి. నాటిక ప్రదర్శనలను కళాభిమానులు పెద్ద సంఖ్యలో తిలకించారు.

పరిశ్రమల ఏర్పాటుకు వెయ్యి ఎకరాలు

మాకవరపాలెం: పరిశ్రమల ఏర్పాటు కోసం వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూమిని సిద్ధం చేస్తున్నామని నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన గురువారం మాట్లాడారు. మండలంలోని రామన్నపాలెం వద్ద ఏపీఐఐసీ ఆధీనంలో 300 ఎకరాల భూమి ఉందన్నారు. ఈ భూముల్లో ఉన్న జంగిల్‌ను తొలగించే పనులు చేయిస్తున్నామన్నారు రాచపల్లి రెవెన్యూ పరిధిలోని యరకన్నపాలెంలో ఉన్న ప్రభుత్వ భూములను కూడా పరిశ్రమల స్థాపనకు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరమణ ఉన్నారు.

రూ.లక్ష విలువ చేసే టేకు దుంగలు పట్టివేత


పట్టుబడిన టేకు దుంగల వాహనంతో ఫారెస్టు అధికారులు

కోటవురట్ల : అక్రమంగా తరలిస్తున్న టేకు కలపను అటవీ శాఖాధికారులు పట్టుకున్నారు. నర్సీపట్నం ఫారెస్టు రేంజరు రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం..టేకు కలప అక్రమంగా రవాణా అవుతోందన్న విశ్వసనీయ సమాచారంతో ఫారెస్టు రేంజరు రాజేష్ ఆధ్వర్యంలో సిబ్బంది యండపల్లి వద్ద బుధవారం రాత్రి నిఘా వేశారు. ఎటువంటి అనుమతి లేకుండా టేకు దుంగలను తరలిస్తున్న బొలెరో వాహనాన్ని గుర్తించి పట్టుకున్నారు. వాహనం దాలింపేట కర్రల మిల్లు యజమాని శ్రీరామ్మూర్తికి చెందినదిగా గుర్తించి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఫారెస్టు రేంజరు రాజేష్ మాట్లాడుతూ కొంత కాలంగా అక్రమంగా టేకు కలప రవాణా అవుతోందన్న ముందస్తు సమాచారంతో దాడి చేసినట్టు తెలిపారు. పట్టుబడిన టేకు కలప విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని, దీనిపై దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ఎవరైనా అక్రమంగా కలప రవాణా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతే కాకుండా కర్రల మిల్లుల వ్యాపారులు అనధికారికంగా కలపను నిలువ చేస్తే కర్రల మిల్లు లైసెన్సు రద్దుకు ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తామని తెలిపారు.

చెట్టు కూలి బైకుపై వెళ్తున్న వ్యక్తి మృతి


చెట్టు పడి చనిపోయిన శ్రీనివాసరావు


క్రేన్‌ల సహాయంతో చెట్టును తొలగిస్తున్న దృశ్యం

పాయకరావుపేట రోడ్డు పక్కన వున్న పెద్ద చెట్టు పడి డెక్కన్ కెమికల్స్‌లో పని చేస్తున్న ఉద్యోగి మృతి చెందాడు. సీఐ జి.అప్పన్న అందించిన వివరాలివి. తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం, దూళ్లపేటకు చెందిన తోట శ్రీనివాసరావు (34) అనే వ్యక్తి డెక్కన్ కెమికల్స్‌లో ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నీషియన్‌గా ఇఅండ్‌హెచ్ కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్నాడు. శ్రీనివాసరావు గురువారం ఉదయం ఉద్యోగరీత్యా కంపెనీకి వెళ్తున్నాడు. రాంభద్రపురం దాటిన తర్వాత రోడ్డుకి కుడివైపున వున్న పెద్ద గన్నెరు వృక్షం ఉదయం 8.30 గంటల సమయంలో నేలకొరిగి బైక్ పై వెళ్తున్న శ్రీనివాసరావుపై పడింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాసరావుతో పాటు బైక్‌పై ప్రయాణిస్తున్న మరో ఉద్యోగి ప్రమాదం నుంచి తప్పించుకోగా, స్వల్పగాయాలయ్యాయి. అతనిని తుని ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చెట్టు కింద పడి ఉన్న శ్రీనివాసరావు మృతదేహాన్ని రోడ్డును తొలచి బయటకు తీశారు. తుని ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. డెక్కన్ కెమికల్స్ యాజమాన్యం పడిపోయిన చెట్ల క్రేన్ సహాయంతో తొలగించారు.

చెరువులో కాలుజారి రైతు మృతి


రామునాయుడు మృతదేహం

చీడికాడ : చెరువులోకి దిగుతున్న పశువులను బయటకు మళ్లించబోయి కాలుజారి చెరువులో పడి రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని ఖండివరంలో చోటు చేసుకుంది. ఈ ఘటనపై ఎస్ఐ బి.సతీష్ అందించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామాని చెందిన ఈర్లె రామునాయుడు(50) గురువారం మధ్యాహ్నం తమ పశువులను మేతకు తోలుకెళ్లాడు. గ్రామ సమీపంలో గల పెద్ద చెరువులోకి పశువులు దిగేందుకు ప్రయత్నించగా వాటిని ఆపే దిశగా రామునాయుడు ప్రయత్నించగా కాలుజారి చెరువులో మునిగిపోయి ఊపిరాడక మృతి చెందాడు. ఈ దుర్ఘటనపై మృతుడు భార్య ఈశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవపంచనామ నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించినట్టు ఎస్ఐ చెప్పారు.

క్షణికావేశంలో వివాహిత ఆత్మహత్య


మృతురాలు గాయత్రి (ఫైల్)

అచ్యుతాపురం రూరల్ : క్షణికావేశంలో తీసుకుంటున్న నిర్ణయాలు కారణంగా నిండు ప్రాణాలు కోల్పోతున్నారు. అనేక కుటుంబాలు ఛిన్నాభిన్నమై పోతున్నాయి. ఈ క్రమంలోనే అచ్యుతాపురం ఎస్‌టీబీఎల్‌లో అద్దెకు నివాసముంటున్న కొండల గాయత్రి (21) బుధవారం ఉరి వేసుకుని మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే సీఐ నమ్మి గణేష్ తెలిపిన వివరాల ప్రకారం మన్యం జిల్లా, వీరఘట్టం మండలానికి చెందిన మృతురాలు గాయత్రికి 2024 మార్చ్ నెలలో శంకర్రావుతో వివాహమైంది. గాయత్రి భర్త అచ్యుతాపురం ఎంఎస్ఎంఈలో అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గాయత్రి భర్త ఉదయం 9.30 గంటలకు ఉద్యోగరీత్యా విధులకు హాజరై తిరిగి రాత్రి 8.30 గంటలకు ఇంటికి తిరిగి వచ్చే సరికి గాయత్రి వంటగదిలో చున్నీతో ఉరివేసుకుని మృతి చెంది ఉండడం గమనించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. మృతురాలు గర్భం పోవడంతో పలు మార్లు ఇరుగు పొరుగు వారితో తన గర్భం పోయిందని చెబుతూ ఆవేదన చెందినట్టు విచారణలో తెలిసిందన్నారు. అయితే క్షణికావేశంలో తొందరపాటు నిర్ణయం తీసుకున్న కారణంగానే ఉరి వేసుకుని మృతి చెందినట్టు పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. కేసు నమోదు చేసి ఇతర కారణాలపైనా దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురు అరెస్ట్

నర్సీపట్నం : హత్యాయత్నం కేసులో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామని టౌన్ ఇన్‌ఛార్జీ సీఐ ఎల్.రేవతమ్మ తెలిపారు. వెలమవీధికి చెందిన పి.వి.నాయుడుతో కాపువీధికి చెందిన ఎస్.రవికిరణ్, ఎం.త్రిమూర్తులు, ఎస్.లోవకుమార్ వైన్‌షాపు సమీపంలోని పాన్‌షాప్ వద్ద బజ్జీల తినే విషయంలో గొడబ పడ్డారు. ఈ క్రమంలో పి.వి.నాయుడును చంపేందుకు ముగ్గురు వ్యక్తులు దాడి చేశారని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

క్లుప్తంగా

ఘనంగా మరిడిమాంబ పండగ

అనకాపల్లి టౌన్: పట్టణంలోని మరిడిమాంబ అమ్మవారి పండుగ గురువారం ఘనంగా జరిగింది. వేకువజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఉర్రూతలూగించాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోట్ని పూర్ణ చంద్రరావు, కమిటీ సభ్యులు, వీధి పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

వైభవంగా రాజమాతంగేశ్వరి యాగం



రాజమాతంగేశ్వరి యాగం చేస్తున్న భక్తులు

అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామమైన కె.ఎస్.ఆర్.పేట రాజుపాలెం రహదారిలోని లలితాదేవి పీఠంలో గురువారం రాజమాతంగేశ్వరి యాగం నిర్వహించారు. 200 మంది భక్తులతో పీఠం వ్యవస్థాపకుడు ఎం.రాధాకృష్ణ శర్మ, అర్చకులు గణపతి పూజ, పుణ్యాహవచనం వంటి తదితర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు



తాళ్లపాలెంలో పూడుపోయిన కాలువను పరిశీలిస్తున్న ఎంపీడీవో ధర్మారావు

కశింకోట: పంచాయతీ మురుగు కాలువల్లో పూడికలు తీయించడానికి, పారిశుధ్యాన్ని మెరుగుపర్చడానికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ధర్మారావు పంచాయతీ కార్యదర్శి, సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని తాళ్లపాలెం పంచాయతీలో మురుగు కాలువలను గురువారం పరిశీలించారు. యలమంచిలి వైపు మార్గంలో కాలువలో పూడిక తీత పనులను పరిశీలించారు. గ్రామంలోని కాలువలను పూడికలు తీసి శుభ్రపరచాలన్నారు. కాలువలను పూడ్చి వేయడానికి ప్రయత్నించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సంత ప్రాంతంలో రోడ్డుపై నిలిచిపోతున్న నీటిని పోవడానికి తవ్విన కాలువను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి మళ్ల సత్యప్రసాద్, తదితరులు ఆయన వెంట పాల్గొన్నారు.

వర్షంతో ఇబ్బందులు



కశింకోట ఆర్టీసీ బస్ స్టేషన్ రోడ్డులో చేరిన వర్షపు నీరు

కశింకోట: స్థానిక ఆర్టీసీ బస్సు స్టేషన్ ఆవరణ బురదమయంగా మారింది. గురువారం సాయంత్రం కశింకోటలో కురిసిన వర్షానికి రోడ్లు బురదమయం అయ్యాయి. ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. స్థానిక ఆర్టీసీ బస్ స్టేషన్‌లో బురదమయం కావడంతో బస్సులు ఎక్కి, దిగడానికి ప్రయాణికులు ఇబ్బంది చెందారు. స్థానిక వారపు సంతలో ముమ్మరంగా వ్యాపార కార్యకలాపాలు సాగే సమయంలో వర్షం పడి నష్ట కలిగించిందని వ్యాపారులు ఆవేదన చెందారు. వర్షం వరి నారుమళ్లకు ఉపకరిస్తుందని రైతులు తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 74 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,500	4,500
రెండో రకం	3,600	3,600
మూడోరకం	3,100	3,350

అనకాపల్లి సినిమాలు

రాజా	:వార్ 2
సత్యనారాయణ స్క్రీన్-1	:వార్ 2
సత్యనారాయణ స్క్రీన్-2	:కింగ్ డమ్
పర్తిసాయి	:మహావతార్ నరసింహం
షిర్డిసాయి	:కూలీ
వెంకటేశ్వర	:హరిహర వీరమల్లు
శ్రీ సత్య	:సోమేశ్వర సులోచన
రామచంద్ర	:వార్ -2

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 28 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5, బీ పాజిటివ్-7, ఓ పాజిటివ్-12, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్ (9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 367 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 294 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

పంద్రాగస్టు వేడుకలు ఎలా?





బురదమయంగా ఎన్టీఆర్ క్రీడా మైదానం



పూల్‌బాగ్ రోడ్డు రహదారిలో వర్షపునీరు

- బురదమయంగా ఎన్టీఆర్ క్రీడా మైదానం
- క్రషర్ బుగ్గి పోసినా తడారని నేల
- 15 బెంజ్ లారీలతో తాత్కాలిక చర్యలు
- స్వాతంత్య్ర వేడుకల నిర్వహణకు ఆపసోపాలు
- వర్షపునీరు బయటకు పోయే మార్గం లేక ఇక్కట్లు

అనకాపల్లి: పంద్రాగస్టు వేడుకల నిర్వహణకు జిల్లా అధికారులు ఆపసోపాలు పడుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పట్టణంలో ఎన్టీఆర్ క్రీడా మైదానం బురదమయంగా మారింది. దాంతో శుక్రవారం నిర్వహించే స్వాతంత్య్ర వేడుకల్లో పలు శాఖలకు చెందిన శకటాల ప్రదర్శనతోపాటు పోలీసు పరేడ్, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఇబ్బందులు తప్పవని ఆందోళన వ్యక్తమవుతోంది. శుక్రవారం కూడా వర్షం కురిస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన దాఖలాలు లేవు. గురువారం ఇక్కడ 15 బెంజ్ లారీలతో క్రషర్ బుగ్గి తీసుకొచ్చి వర్షపునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకున్నారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత ఎన్టీఆర్ క్రీడా మైదానంలో ఏటా స్వాతంత్య్ర దినోత్సవం, రిపబ్లిక్ వేడుకలు అత్యంత వైభవంగా జిల్లా యంత్రాంగం నిర్వహిస్తోంది. ఇంత ప్రాధాన్యత కలిగిన క్రీడా మైదానంలో చిన్నపాటి వర్షానికి బురదగా మారుతోంది. దీంతోపాటు పట్టణంలో పలు ముఖ్యమైన ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంటోంది.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వర్షపు నీరు...

చిన్నపాటి వర్షానికి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వర్షపు నీరు ప్లాట్‌ఫాం పైకి వస్తుంది. ప్రయాణికుల కూర్చొనే బెంచీలు వద్దకు వర్షపు నీరు చేరి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాంప్లెక్స్‌కు, గ్యారేజీ డిపోకు మధ్యలో డ్రైనేజీని పూర్తిస్థాయిలో ఆధునికీకరించినట్లయితే వర్షపు నీరు నిల్వ ఉండే పరిస్థితి లేకుండా ఉండేది. పట్టణ పరిధిలో పూల్‌బాగ్‌రోడ్డు నుంచి నూకాంబిక ఆలయానికి వెళ్లే రహదారి కొదిపాటి వర్షంతో నిండిపోతోంది. నీరు పోయేందుకు మార్గం లేకపోవడంతో ప్రజలు, వాహనదారుల నీటిలో ప్రయాణం చేయాల్సి వస్తోంది.

ఎన్టీఆర్ ఆస్పత్రి రహదారి సమీపంలో...

అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి గ్రామీణ జిల్లాల నుంచి నిత్యం వేలాదిమంది రోగులు వైద్యం నిమిత్తం రాకపోకలు సాగిస్తారు. వర్షం పడితే రహదారిపై నుంచి ఆస్పత్రికి వెళ్లాలంటే రోగులతోపాటు 108 వాహనాలు, ఇతర వాహనాలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. దీనికి తోడు రహదారికి ఇరువైపులా అంబులెన్సులు పార్కింగ్ చేయడంతో రోగులు మరింత ఇబ్బంది పడుతున్నారు.

డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలి



డ్రైనేజీలో పూర్తిస్థాయిలో పూడిక తీత పనులు చేయాలి. దాంతో వర్షపునీరు రహదారులపై ప్రవహించకుండా ఉండేది. వర్షపునీరు, డ్రైనేజీలో మురుగునీరు రహదారులపై పారడం వల్ల స్థానికులు వ్యాధులు బారినపడే పరిస్థితి ఏర్పడుతుంది. దీనిపై అధికారులు దృష్టి సారించాలి.

– ఎస్.ఈశ్వరరావు, అనకాపల్లి

బురదగా క్రీడా మైదానం



ఎన్టీఆర్ క్రీడా మైదానంలో మూడేళ్లుగా స్వాతంత్య్ర, రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహిస్తున్నారు. క్రీడా మైదానంలో వర్షపు నీరు బయటకు పోయేందుకు మార్గం లేకపోవడంతో బురదగా మారింది. రానున్న రోజులను దృష్టిలో పెట్టుకుని క్రీడా మైదానంలో వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలి.

– పి.సాయికుమార్, అనకాపల్లి

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



కశింకోటలో హర్ ఘర్ తిరంగా ర్యాలీలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు, తదితరులు

కశింకోట: స్వాతంత్య్ర ఉత్సవాల్లో భాగంగా గురువారం హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వివేకానంద స్కూలు విద్యార్థులు, ఉపాధ్యాయులు భారత్ మాతాకు జై అంటూ నినాదనాలు చేస్తూ త్రివర్ణ పతాకాలు పట్టుకొని స్థానిక పోస్టాఫీసు వద్ద నుంచి గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భారతమాత విగ్రహానికి పూలమాల వేసి పాదాభివందనాలు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జి చిట్టిబాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పలకాల రవి, వివేకానంద స్కూలు కరస్పాండెంటు మళ్ల జగదీష్, ఉపాధ్యాయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్వాతంత్య్ర వేడుకలకు ఏర్పాట్లు

మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, స్కూళ్లు, వివిధ సంస్థల్లో శుక్రవారం స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. స్థానిక ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలు, పోలీసు స్టేషన్, పాఠశాలల్లో రంగుల కాగితాలతో జెండాలు అంటించి మువ్వన్నెల పతాకాన్ని ఎగుర వేయడానికి సర్వం సిద్ధం చేశారు.

నేడు రింగ్‌రోడ్డులో స్వాతంత్య్ర వేడుకలు

అనకాపల్లి: స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం 79వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ జెండా ఆవిష్కరణ చేస్తారన్నారు. ముఖ్య అతిథులుగా పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, మాజీ ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ విచ్చేయుచున్నట్లు చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు హాజరు కావాలని కోరారు.

పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు

- ఎస్పీ తుహిన్ సిన్హా



పెట్రోలింగ్ వాహనాలను ప్రారంభిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి: పట్టణంలో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు, వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు డీసీఎంఎస్ స్థలాన్ని కేటాయించామని ఎస్పీ తుహిన్ సిన్హా, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో స్మార్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కంట్రోల్ రూమ్, డీసీఎంఎస్ ప్రాంగణంలో వాహన పార్కింగ్ స్థలాన్ని గురువారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొణతాల మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి కారణంగా రహదారులపై వాహనాల పార్కింగ్ వల్ల ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు జిల్లాలో స్మార్ట్ పోలీసింగ్ అమలు చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా పట్టణ పరిధిలో డ్రోన్లు, అధునాతన సీసీటీవీ కెమెరాలు వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, శాంతి భద్రతలతో పాటు ట్రాఫిక్ వ్యవస్థను మెరుగుపరచడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి రిఫ్లెక్టివ్ రేడియం జాకెట్లు, బాటన్ లైట్లు అందజేశారు. కంట్రోల్ రూమ్ ద్వారా పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 32 సీసీ కెమెరాల పర్యవేక్షణ జరుగుతుందన్నారు. అంతకుముందు పెట్రోలింగ్ వాహనాలను ఎమ్మెల్యే, ఎస్పీ ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రావణి, ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీష్, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, ఉమెన్ పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఇ.శ్రీనివాసులు, సీఐలు బాల సూర్యారావు, విజయకుమార్, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

శ్రీకృష్ణాష్టమి వేడుకలకు సన్నాహాలు





కశింకోటలోని కోనేరు వద్ద కృష్ణ ఆలయం, ఆలయంలో శ్రీకృష్ణుడు

కశింకోట: పలు ఆలయాల్లో ఈ నెల 16న శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక కోనేరు వద్ద కృష్ణ ఆలయంలో వంశీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. కోలాటాలు, తోడపెద్దు సేవ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగులతో ముస్తాబు చేసి సిద్ధం చేశారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో కృష్ణాష్టమి సందర్భంగా స్వామి వారిని శ్రీకృష్ణునిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. స్థానిక సంతబయల కొణతాల ధర్మారావు కాంప్లెక్స్ వద్ద కృష్ణాష్టమి పురస్కరించుకొని ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వేద మంత్రాల నడుమ హోమం, సహస్ర నామార్చన, భక్తులతో విష్ణు సహస్ర నామ పారాయణ, సాయంత్రం కోలాటాలు, భజన, పిల్లల నృత్యాలు, ఉట్ల ఉత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

24న మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

అనకాపల్లి: గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 24న ఉదయం 9 గంటలకు స్థానిక మెయిన్‌రోడ్డు పెద్ద హైస్కూల్ ఆవరణలో 3,500 మట్టి గణపతి విగ్రహాలు, పసుపుకుంకుమ, వినాయక వ్రతకల్పం ఉచితంగా పంపిణీ చేస్తామని క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషన్ శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భావితరాలను దృష్టిలో పెట్టుకుని పర్యావరణ పరిరక్షణకు ఈ కార్యక్రమాన్ని 11 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామన్నారు. క్లబ్ సభ్యులు అందరూ హాజరు కావాలన్నారు.

ట్రాక్టర్ ర్యాలీ

అనకాపల్లి టౌన్:

అన్నదాత సుఖీభవ పథకం ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పట్టణంలోని ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎమ్మెల్యే కొణతాల ప్రారంభించి స్వయంగా ట్రాక్టర్ నడిపారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భూమి ఉన్న ప్రతీ రైతుకు పెట్టుబడి సాయం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు అందజేసిందన్నారు. కార్యక్రమంలో రైతులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



కృష్ణుని వేషధారణలో విద్యార్థులు

అనకాపల్లి టౌన్: స్థానిక ఏఎంఏఎల్ హైస్కూల్‌లో శ్రీకృష్ణాష్టమి ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుని, గోపిక వేషధారణలో నృత్యాలు చేసి అలరించారు. కార్యక్రమానికి హాజరైన వర్తక సంఘం కార్యదర్శి కొణతాల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ శ్రీకృష్ణుడు ఉపదేశించిన భగవద్గీతను ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ అధ్యక్షుడు గ్రంధి సురేష్, కరస్పాండెంట్ కొణతాల శివకుమార్, ఆస్క్ కాలేజ్ కరస్పాండెంట్ బాల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సింహాచలంలో ఘనంగా నిత్యాన్నదాన వార్షికోత్సవం




భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న అధికారులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకం వార్షికోత్సవం గురువారం సింహగిరిపై వైభవంగా నిర్వహించారు. ఈ పథకం 36 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేవస్థానం అధికారులు ఈ వేడుకలను నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా భక్తులకు నిత్యం అందించే అన్నప్రసాదాలతో పాటు, ప్రత్యేకంగా తయారు చేసిన చక్కెర పొంగలి, బూరెలు, పులిహోర అందజేశారు. అన్నప్రసాద భవనంలో సింహాద్రినాథుని చిత్రపటం వద్ద దేవస్థానం ఏఈవోలు తిరుమలేశ్వరరావు, రమణమూర్తి, సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు, సీనియర్ అసిస్టెంట్ రేవతి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రేపటి నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేత

తుమ్మపాల: మండలంలో శంకరం, భట్లపూడి, గొలగాం, గోపాలపురం, రేబాక, ఎన్‌జీ అగ్రహారం, కోడూరు, కొండుపాలెం పంచాయతీల్లో ఈ నెల 16, 18, 19 తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ సబ్బవరం సెక్షన్ ఏఈ అశోక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్బవరం-01 సెక్షన్ 33/11కేవీ, కొప్పాక సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ శంకరం రూరల్ ఫీడర్ ఆర్‌డీఎస్‌లో మరమ్మతుల వల్ల విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించవలసిందిగా కోరారు.


తూర్పు కాపు సంక్షేమ సంఘ భవనం ప్రారంభం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: స్థానిక బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మించిన బాలగణపతి తూర్పు కాపు సంక్షేమ సంఘ సామాజిక భవనాన్ని గురువారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ ప్రారంభించారు. స్థలాన్ని పంచాయతీ సమకూర్చగా, స్థానిక కాపు నేతలు విరాళాలు సేకరించి నూతనంగా భవనాన్ని నిర్మించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కాపు కులస్తులు సోదరభావంతో మెలగాలన్నారు. సంఘాన్ని బలోపేతం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, మాజీ ఎంపీపీ దాసరి అప్పారావు, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, పెద్దలు పెంటకోట సత్యనారాయణ, కోనపల్లి రామ్మోహనరావు, ఆడారి లక్ష్మణరావు, కాశీబాబు, కాండ్రేగుల జగన్, ఆడారి గోపీ, సంఘ అధ్యక్షుడు బలిరెడ్డి సూరప్పారావు, గాలి నాగేష్, కస్పా శ్రీను, బలిరెడ్డి రాజు, బుదిరెడ్డి సూరప్పారావు, బలిరెడ్డి సంతోష్, చంద్రపాటి లోకేష్, బుదిరెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

వార్డు అభివృద్ధికి సహకరించాలని వినతి



మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సునీత జానకీరామరాజు

అనకాపల్లి టౌన్: రాజకీయాలకు అతీతంగా వార్డును అభివృద్ధి చేసేందుకు సహకరించాలని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత జానకీరామరాజు కోరారు. విశాఖపట్నం మేయర్ చాంబర్‌లో మేయర్ పీలా శ్రీనివాసరావును గురువారం ఆమె కలిసి వివిధ అభివృద్ధి పనులు, సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వార్డులో సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కో ఆర్డినేటర్ మేరీ సువార్త

అనకాపల్లి: విద్యార్థి దశ నుంచి ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ప్రణాళికలు నిర్వహించాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా మిషన్ కో ఆర్డినేటర్ కె.మేరీ సువార్త తెలిపారు. స్థానిక మెయిన్‌రోడ్డు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బాలురుకు యువ గ్రూప్, బాలికలకు శక్తి గ్రూప్ ఏర్పాటు చేసి ర్యాగింగ్‌పై గురువారం అవగాహన కల్పించారు. నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తప్పుదోవ పడకుండా ఉపాధ్యాయలు, అధ్యాపకులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు, పోక్సో కేసులు, అక్రమ రవాణా, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ వంటి అంశాలపై వివరించారు. కార్యక్రమంలో మిషన్ పీవో మనోహర్, తదితరులు పాల్గొన్నారు.